క్లుప్తంగా

రాష్ట్రపతి భవన్‌లో విద్యార్థుల సందడి



గచ్చిబౌలి: రాష్ట్రపతి భవన్‌లో కొండాపూర్‌లోని కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు సందడి చేశారు. శనివారం బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌ను సందర్శించారు. సుగంధ ద్రవ్యాల మొక్కలు, పూల మొక్కలను చూపించి వాటి గురించి వివరించారు.

కళాకారులకు సత్కారం

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా శనివారం వేంకటేశ్వర శశినికేతన్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గురువు దీప నేతృత్వంలో గణపతి స్తుతి, మధ్యమారుత, ముద్దుగారే యశోద, జతి స్వరం తదితర అంశాలను కళాకారులు కిన్నెర, మనస్విని, భవిష్య, దుర్గా, సుప్రియ, వర్షా, గాయత్రి, శనయ, ప్రఖ్యా, రిత్యాశ్రీ, హర్షిత, దీక్ష తదితరులు ప్రదర్శించారు. అనంతరం డాక్టర్ శోభరాజు కళాకారులను సత్కరించారు.

ఆరంభ టౌన్‌షిప్‌లో ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న సుజాతయాదవ్, కార్పొరేటర్ నాగేందర్ ,కాలనీవాసులు

మియాపూర్: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ఆరంభ టౌన్‌షిప్‌లో ఆరంభ మహిళా అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఆరంభ టౌన్‌షిప్ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్‌పర్సన్ రాగం సుజాత యాదవ్, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌లు హాజరై ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆరంభ టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్ రాథోడ్, మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యురాలు అరుణ శ్రీ, సరిత, మౌనిక, విజయచౌహాన్, కరిష్మాఖాన్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ.. తాగునీరు రోడ్డుపాలు



ఆల్విన్ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై పారుతున్న తాగునీరు

మియాపూర్: మియాపూర్ ఆల్విన్ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై తాగునీటి పైపులైన్ లీకేజీతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత కొంతకాలంగా పైపులైన్ లీకేజీతో ఆ ప్రాంతంలో రోడ్డంతా గుంతలమయంగా మారింది. జాతీయ రహదారిపై రోజుల తరబడి నీరుపారుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

17 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



సమావేశంలో పాల్గొన్న టీటీడీ ఎల్‌ఏసీ పాలక మండలి సభ్యులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 17 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తామని టీటీడీ ఎల్‌ఏసీ చైర్మన్ భాస్కర్ రావు తెలిపారు. శనివారం ఆయన ఎల్‌ఏసీ కమిటీ ఉపాధ్యక్షుడు కోమటిరెడ్డి లక్ష్మి, వెంకట్ రెడ్డి, రవి ప్రసాద్, అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. బ్రహ్మోత్సవాల్లో నగర వ్యాప్తంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనే అవకాశం ఉండటంతో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందుకోసం డెకరేషన్ కమిటీ, ఫుడ్ కమిటీ, ప్రొటోకాల్ కమిటీ, కల్చరల్ కమిటీ, రిసెప్షన్ కమిటీతో పాటు మరికొన్ని కమిటీలను వేస్తున్నామన్నారు. అదే విధంగా ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అండాళ్ అమ్మవారు, లక్ష్మీ దేవి ఆలయాల నిర్మాణంపై కూడా చర్చించారు. సమావేశంలో ఎల్‌ఏసీ కమిటీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, బోజిరెడ్డి, ప్రతిమ, రమణారెడ్డి, శివగణేష్, ఉమ పాల్గొన్నారు.

ఉన్నతవిద్యకు 'నవోదయ'ం

- జేఎన్‌వీ దరఖాస్తులకు జనవరి 31 చివరి తేదీ
- ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29వ తేదీ
- విద్యతోపాటు క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక రంగాలతో ప్రోత్సాహం



గోపన్‌పల్లిలోని జేఎన్‌వీ రంగారెడ్డి జిల్లా ప్రాంగణ ప్రధాన భవనం

రాయదుర్గం: గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో ఇంగ్లిష్ మీడియం విద్య జవహర్ నవోదయ విద్యాలయాలు అందిస్తున్నాయి. క్రమశిక్షణ, వ్యక్తిత్వం, నైతిక విలువలు, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలకు చెందిన విద్యార్థులకు అవకాశం ఉంటుంది. 1987లో శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలోని 37 ఎకరాల స్థలంలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని స్థాపించారు. 2023–24 విద్యాసంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశం కోసం జేఎన్‌వీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో జవహర్ నవోదయ విద్యాలయం గురించి కథనం..

ప్రవేశ పరీక్ష వివరాలు..

- జేఎన్‌వీ రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం 5వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తునకు ఈనెల 31వ తేదీ ఆఖరు.
- ఎంపికకు ఏప్రిల్ 29న పరీక్ష నిర్వహిస్తారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో ఎంపిక చేసిన కేంద్రాలలో పరీక్ష ఉంటుంది.

రిజర్వేషన్లు..

- గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కనీసం 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తారు.
- మొత్తంలో 1/3 వంతు సీట్లు బాలికలు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పిస్తారు.

ఇతర సౌకర్యాలు..

- ఈ విద్యాలయంలో భౌతిక, రసాయన, జీవశాస్త్రాల, కంప్యూటర్ ప్రయోగశాలలు, కళా, సంగీత, సాంఘిక శాస్త్ర విభాగాలు, మ్యూజియం కార్నర్ వంటి ప్రత్యేక వసతులతో పూర్తిస్థాయి అకడమిక్ బ్లాక్ రూపొందించారు.
- వివిధ రకాల క్రీడలకు సరిపడా ఆటస్థలం, కోర్టులు, ఇండోర్ గేమ్స్ సౌకర్యం కల్పించారు.
- ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు, పరుగుపందెం కోసం ప్రత్యేక ట్రాక్ ఉంది.
- బాలబాలికలకు వేర్వేరుగా ఆరావళి, శివాలిక్, ఉదయగిరి, నీలగిరి, అనే పేర్లతో మొత్తం 8 సదనాలు ఉంటాయి,
- స్టెమ్/విజ్ఞానజ్యోతి పథకం కింద 11వ తరగతి బాలికలకు కేంద్ర శాస్త్రసాంకేతిక శాఖ ద్వారా ఉపకార వేతనాలు, సైన్స్ కిట్లు, ప్రముఖ సైన్స్ సెంటర్ల సందర్శన, వైజ్ఞానిక ప్రముఖులచే ఇంటరాక్షన్ వంటి అవకాశాలు కల్పిస్తారు.
- వైజ్ఞానిక వైఖరి, శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు పరమాణుజ్యోతి అనే కార్యక్రమం అమలు చేస్తారు.
- అవంతి ఫెలోషిప్ కింద 11,12 తరగతుల విద్యార్థులకు యూట్యూబ్ ద్వారా మ.3 నుంచి రాత్రి 7.45 వరకు ఫిజిక్స్, మ్యాథ్స్, బయో, కెమిస్ట్రీ సబ్జెక్టులలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు.
- వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, సంగీత, నృత్య సంబంధిత పోటీలు నిర్వహిస్తారు
- ఎన్‌సీసీలో కూడా విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఆర్‌డీ పెరేడ్‌కు ఎంపికయ్యారు.
- మైగ్రేషన్ విధానం ద్వారా రాజస్థాన్‌లోని జైసల్మేర్ జిల్లాలోని జేఎన్‌వీకి 9వ తరగతిలో 30 శాతం మంది విద్యార్థులు వెళ్లాలి. క్కడి నుంచి ఇక్కడికి వస్తారు.

ప్రణాళికతో కష్టపడితే సీటు ఖాయం..



ప్రణాళికతో చదివితే జేఎన్‌వీ రంగారెడ్డి జిల్లాలో సీటు పొందవచ్చు. తక్కువ సమయంలో సరైన సమాధానాలు చేయాలి. కాబట్టి సాధన చాలా అవసరం. ప్రశ్నపత్రం తయారీ నుంచి విద్యార్థుల ఎంపిక వరకు జరిగే అన్ని ప్రక్రియలను సీబీఎస్ వారే నిర్వహిస్తారు. విద్యార్థులు మంచి భవిష్యత్తును పొందేలా చేస్తాం.

–డానియల్ రత్నకుమార్, ప్రిన్సిపాల్, జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లా

రూ.1.76 కోట్లతో కొత్తకుంట అభివృద్ధి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



కొత్తకుంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, అధికారులు, నాయకులు

హఫీజ్‌పేట్: కొత్తకుంట అభివృద్ధి కోసం రూ.1.76 కోట్లను వెచ్చించనున్నట్లు ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్‌లోని కొత్తకుంటను ఆయన నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తకుంట కలుషితం కాకుండా డ్రైనేజీ వ్యవస్థ మళ్లింపు పనులు వేగవంతం చేయాలని, చేపట్టే పనులలో నాణ్యత పాటించాలని సూచించారు. చెరువు సుందరీకరణలో భాగంగా చెరువుకట్ట పటిష్టం చేయడం, పునరుద్ధరించడం, మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే కాలువ, అలుగు మరమ్మతులు, వాకింగ్ ట్రాక్, గ్రీనరీ వంటి పనులను చేయడం జరుగుతుందన్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ మేర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డీఈ నళిని, నాయకులు గౌతమ్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మారెడ్డి, వెంకటేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, దాత్రిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం

జోనల్ కమిషనర్ శంకరయ్య



గచ్చిబౌలి క్యూ మార్ట్ వద్ద రోడ్డును పరిశీలిస్తున్న వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య, డీసీపీలు

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను వివిధ విభాగాల అధికారుల సమన్వయంతోనే పరిష్కరించేందుకు వీలవుతుందని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ జె.శంకరయ్య పేర్కొన్నారు. శనివారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ రావు, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లీతో కలిసి సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ జామ్ నుంచి వాహనదారులకు విముక్తి కలగాలంటే రోడ్ల విస్తరణ, జంక్షన్ల డెవలప్‌మెంట్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, విద్యుత్ స్థంభాలను తొలగించాల్సిన అవసరం ఉందని అధికారులు గుర్తించారు. గచ్చిబౌలిలోని క్యూ మార్ట్ నుంచి రాంకీ టవర్స్, డెలాయిట్, మైండ్ స్పేస్ జంక్షన్, ఐటీసీ కోహినూర్, ఖాజాగూడ జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్, బొటానికల్ గార్డెన్, సీఆర్ ఫౌండేషన్, కొత్తగూడ జంక్షన్, అంజయ్యనగర్ తదితర ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. క్యూ మార్ట్ , దుర్గం చెరువు ఎన్‌సీసీ వద్ద విద్యుత్ స్థంబాల తొలగింపు టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీఆర్ ఫౌండేషన్, క్యూ మార్ట్ వద్ద రోడ్డు విస్తరణ, క్యూ మార్ట్ వద్ద డ్రెయిన్ స్లాబ్, బయోడైవర్సిటీ నుంచి లెదర్ ఫ్యాక్టరీ వరకు రోడ్డు విస్తరణ, ఫుట్‌పాత్, సైకిల్ ట్రాక్ ఏర్పాటు, లెదర్ ఫ్యాక్టరీ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ, ఫుట్‌పాత్, సైకిల్ ట్రాక్ నిర్మించాలని శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈని ఆదేశించారు. దుర్గం చెరువు ఎన్‌సీసీ రోడ్డు అభివృద్ధి, ఇనార్బిట్ మాల్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని టీఎస్‌ఐఐసీ అధికారులకు సూచించారు. ఆయా విభాగాలు చేపట్టాల్సిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, టీఎస్‌ఎస్‌పీడీసీఎల్, టీఎస్ఐఐసీ, వాటర్ వర్క్స్, ఆర్‌అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

ఖాదీ సిల్క్ చాలా ఇష్టం.. శృతిహాసన్



ఖాజాగూడలో సందడి చేసిన సినీ హీరోయిన్

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలో సినీ హీరోయిన్ శృతిహాసన్ సందడి చేశారు. శనివారం ప్రతిష్టాత్మక మందిర్ ఫార్మాట్ స్టోర్‌ను ఆమె ప్రారంభించారు. ఖాదీ సిల్క్ అంటే తనకు చాలా ఇష్టం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాగ కనక దుర్గాప్రసాద్ చలవాడి, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈపీటీఆర్ఐ, ఆర్‌జీయుకేటీ మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలతో టీపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణి ప్రసాద్, వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ

గచ్చిబౌలి: ఈపీటీఆర్ఐ (ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్), ఆర్‌జీయుకెటీ (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్) బాసర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. విద్య, పరిశోధన, శిక్షణ రంగాలలో సహకరించడానికి జరిగిన ఒప్పందంపై టీపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణి ప్రసాద్, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకట రమణ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వాణి ప్రసాద్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, నీటి వనరుల నిర్వహణ, పర్యావరణ ప్రభావ అంచనా, వ్యర్థాల నిర్వహణ తదితర రంగాలలో పరిశోధనలు చేసేందుకు వీలుంటుందన్నారు. ఆర్‌జీయుకెటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకట రమణ మాట్లాడుతూ పర్యావరణ ఆవిష్కరణలకు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఈపీటీఆర్ఐ శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల, డాక్టర్ స్వరాజ్, డాక్టర్ శేష శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హస్తకళా ప్రదర్శన..

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న హస్తకళా ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటుంది. ప్రదర్శనలో భాగంగా నాట్యాచార్యులు సుధావిజయ్‌కుమార్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఇందులో పుష్పాంజలి, నటేశకౌతం, కీర్తన, మధురాష్టకం, దశావతారం తదితర అంశాలను ప్రదర్శించారు.





వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా అరెస్ట్

గచ్చిబౌలి: గుట్టుచప్పుడు కాకుండా ఓ హోటల్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ గోనె సురేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గౌలిదొడ్డిలోని కాన్‌క్లేవ్ హోటల్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో సైబరాబాద్ యాంటి హ్యూమన్ ట్రాకింగ్ యూనిట్ సభ్యులు శుక్రవారం రాత్రి 7.30 గంటలకు దాడి చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన యువతులతో డేటింగ్ యాప్ ద్వారా విటులను రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్న ఆర్గనైజర్లు పూర్ణిమా కుమారి(22), మనీష్ కుమార్ పాండే(20), హోటల్ మేనేజర్ శ్రీమంత కలిట(35), విటుడు ఎల్.రవీంద్రరెడ్డిలను అదుపులోకి తీసుకొని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ప్రధాన నిందితుడు ప్రిన్స్, ఆర్గనైజర్ అజయ్ అలియాస్ రాహుల్ పరారీలో ఉన్నారు. మహరాష్ట్ర, బిహార్‌కు చెందిన ఇద్దరు యువతులను రెస్క్యూ హోంకు తరలించారు. రూ.1200 నగదు, 12 సెల్‌ఫోన్లు, కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించారు.

ముగిసిన నిందితుడి పోలీసు కస్టడీ

పటాన్‌చెరుటౌన్: వైన్స్ చోరీ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుడి కస్టడీ ముగిసింది. వివరాలిలా.. 2021 సెప్టెంబర్ 30వ తేదీ అర్ధరాత్రి రూ.10 లక్షలు విలువ చేసే మద్యాన్ని గుర్తుతెలియని దుండగులు వాహనంలో వచ్చి ఎత్తుకెళ్లారు. అప్పట్లో వైన్స్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా మధ్యప్రదేశ్ జైల్లో ఉన్న మహారాష్ట్రకు చెందిన సయ్యద్ హుస్సేన్‌ను పటాన్‌చెరు పోలీసులు 3వ తేదీ కస్టడీలో తీసుకున్నారు. విచారణలో సయ్యద్ హుస్సేన్ తోపాటు మొత్తం ఐదుగురు రూ.10 లక్షల విలువైన మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లి రూ.4 లక్షలకు విక్రయించారు. ఈ కేసులో మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. శనివారంలో సయ్యద్ హుస్సేన్ కస్టడీ ముగియడంతో పోలీసులు తిరిగి కోర్టుకు అప్పగించారు.

యూరో స్కూల్ వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

గచ్చిబౌలి: అడవులు అంతరించి పోతే ఎదురయ్యే దుష్పరిణామాలను నాటిక ద్వారా విద్యార్థులు కళ్లకు కట్టినట్లు వివరించారు. గచ్చిబౌలిలోని యూరో స్కూల్ వార్షికోత్సవాన్ని శిల్పకళా వేదికలో శనివారం ఘనంగా నిర్వహించారు. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, అంతరిస్తున్న అడవులతో పర్యావరణానికి కలిగే ముప్పు గురించి 'ఇకోఒడిసి' అనే నాటికను ప్రదర్శించారు. అనంతరం నాటికలు, మ్యూజిక్, గిటార్, డ్రమ్స్, కీ బోర్డులతో విద్యార్థులు అలరించారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

పటాన్‌చెరుటౌన్: వాకింగ్ చేస్తున్న వ్యక్తిని బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ మండల పరిధిలోని బీఎస్ఆర్ కాలనీ పటేల్‌గూడకు చెందిన భిక్షపతి పటేల్‌గూడ చెరువు వద్ద శుక్రవారం సాయంత్రం వాకింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి ఢీకొట్టి వెళ్లిపోయాడు. క్షతగాత్రుడిని మదీనగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. భిక్షపతి కుమారుడు శ్రీరాం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో ఆటోడ్రైవర్‌కు ..

పటాన్‌చెరుటౌన్: మరో ఘటనలో ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీరంగూడ మార్కెట్ వైపు నుంచి కిష్టారెడ్డి పేటకు వెళ్తున్న ఆటోను ఎల్లమ్మ ఆలయం సమీపంలో బైక్ ఢీ కొంది. ఈ ఘటనలో బీరంగూడ మంజీర నగర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ బోగం కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య అనురాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమై.. చెరువులో శవమై..

పటాన్‌చెరుటౌన్: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి శవమై కనిపించిన ఘటన అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. బోరబండకు చెందిన పెనుబాకల సాయికుమార్(32) వ్యాపారం చేసి అప్పులపాలయ్యాడు. గురువారం అమీన్‌పూర్ పెద్దచెరువు వద్దకు వచ్చి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. వెంటనే కుటుంబసభ్యులు అక్కడకు వచ్చి చూడగా బైక్, మొబైల్ ఫోన్లు లభించాయి. దీంతో సాయికుమార్ కుటుంబ సభ్యులు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. శనివారం ఉదయం అమీన్‌పూర్ పెద్దచెరువులో మృతదేహంను కనుగొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తమ్ముడు శ్రావణ్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం తథ్యం



సమావేశంలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

మియాపూర్: బీజేపీ అధికారంలోకి రావడం తథ్యం అని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం చందానగర్‌లోని క్రిస్టల్ గార్డెన్‌లో శేరిలింగంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాఘవేందర్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనంను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ పాలక్ బూర నర్సయ్యగౌడ్, ప్రభారి దామోదర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు బూత్ కమిటీ అధ్యక్షులు ,శక్తి కేంద్రాల ఇంచార్జీలతో కలిసి వర్చువల్ ద్వారా బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ల ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు అందే విధంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు విసిగిపోయారని, బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జాయింట్ కన్వీనర్ మణిభూషన్, రాష్ట్ర నాయకులు మువ్వా సత్యనారాయణ, గజ్జెల యోగానంద్, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, డాక్టర్ నరేష్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నాగేశ్వర్‌గౌడ్, వసంత్‌కుమార్, నరేందర్‌రెడ్డి, అరుణ్, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి, నాయకులు, శక్తి కేంద్ర ఇంచార్జులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సిల్క్ ఎక్స్‌పో

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో గ్రామీణ హస్తకళావికాస్ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2023 మగువల మనసును దోచుకుంటోంది. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్ చీరలు, డిజైనరీ ఆభరణాలను సుమారు 70 స్టాళ్లలో అందుబాటులో ఉంచామని, నిర్వాహకుడు జయేష్‌గుప్తా తెలిపారు. ఈనెల 10 వరకూ ఉదయం 10 నుంచి రాత్రి 9 వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

వాకింగ్..యోగా

- నగరవాసి రోజువారీ ఆరోగ్య షెడ్యూల్
- కిటకిటలాడుతున్న పార్కులు, గ్రౌండ్‌లు





దీప్తీశ్రీనగర్ పార్కులో వాకింగ్ చేస్తున్న ప్రజలు

మియాపూర్: సంపూర్ణ ఆరోగ్యానికి సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి మంచి జీవన విధానం అవసరమని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. మంచి ఆహారం, నిత్యం నడక, వ్యాయామం, యోగా సాధనతో ఆరోగ్యంగా ఉండవచ్చు. ఉరుకుల పరుగుల జీవనలో మనిషులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో వయస్సుతో నిమిత్తం లేకుండా అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రస్తుతం ఒత్తిడి, పనుల నుంచి ఉపశమనం కోసం ప్రతిరోజు ఉదయం నడక, వ్యాయామం, యోగాలపై ఆసక్తి చూపుతున్నారు. దీప్తీశ్రీనగర్, పీజేఆర్ స్టేడియం, జయప్రకాష్‌నగర్ పార్కు, హుడా కాలనీ పార్కుల్లో నిత్యం ఉదయం, సాయంత్రం ప్రజలు వాకింగ్‌కు వస్తున్నారు.

వాకింగ్.. యోగా..సంపూర్ణ ఆరోగ్యం

నా వయస్సు ప్రస్తుతం 60 సంవత్సరాలు. కానీ ఇప్పటి వరకు ఆరోగ్యంగా ఉన్నాను. 15 సంవత్సరాల నుండి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గంటపాటు వాకింగ్ చేస్తూ యోగా అలవాటు చేసుకున్నాను. దీంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటున్నా. ప్రతిరోజు వాకింగ్ చేయడం వల్ల ఇప్పటి ఆరోగ్యంగానే ఉన్నాను.

–నాగేశ్వర్‌రావు, స్థానికుడు

క్రమం తప్పకుండా వాకింగ్

ప్రతిరోజు క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తుంటాను. 20 ఏళ్లుగా వాకింగ్ చేయడం అలవాటు చేసుకున్నాను. ఒక్కరోజు వాకింగ్ చేయకపోతే మనస్సు ఎలాగో ఉంటుంది. ఉదయం, సాయంత్రం వాకింగ్‌తో మానసికంగా, ఆరోగ్యంగా ధృడంగా ఉంటుంది.

–రామ్మోహన్, స్థానికుడు